
భక్తజన బాంధవుడికి ఆరాధనలు


శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుప్రభాతంతో మొదలైన నిత్యారాధనలు రాత్రి జరిపిన శయనోత్సవం కైంకర్యంతో తెర పడింది. మధ్యాహ్నం వరకు దైవదర్శనానికి భక్తులు బారులు తీరారు. పూజారులు మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం, స్వర్ణపుష్పారాధన, అలంకార సేవోత్సవాలు ఆలయ ఆచారంగా కొనసాగించారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభువులను మహాముఖ మండపంలో దూరం నుంచే స్మరిస్తూ, భక్తులు భక్తితో దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకార సేవోత్సవాన్ని వేద మంత్రాల మధ్య నిర్వహించారు. రాత్రి వేళ స్వయంభువులకు ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామిని కొలుస్తూ నిజాభిషేకం, తులసీ అర్చన, నిత్యకల్యాణం జరిపారు.


దైవ దర్శనానికి వేచి ఉన్న భక్తులు

కమిటీ కనుసన్నల్లో కొనుగోళ్లు

- రెండు రకాల ధాన్యం కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ
- పర్యవేక్షణ బృందాలతో నిత్యం తనిఖీ


ఆత్మకూర్(ఎస్) కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ బోనస్‌ను 2024-25 వానాకాలం నుంచే అమలు చేసేందుకు సర్కారు సిద్ధమైంది. అందులో భాగంగా సన్నాలు, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఆయా కేంద్రాల్లో కొనుగోళ్ల పరంగా ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేలా మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, ఏఈవోలు, ఐకేపీ ఏపీఎంలు, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీఈవో, మెప్మా అధికారులు సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఈ కమిటీలకు సంబంధించి జిల్లా కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.

సన్నరకాల గుర్తింపు ఇలా..

◆ సన్న ధాన్యంపై అనుమానం ఉంటే కేంద్రానికి కేటాయించిన మైక్రోమీటర్ ద్వారా రైతు, ఏఈవో, కేంద్ర నిర్వాహకుల సమక్షంలో ధాన్యం గింజను కొలుస్తారు.

◆ ధాన్యం పొట్టు తీసి పొడవు, వెడల్పు నిష్పత్తి లెక్కిస్తే 3 కన్నా తక్కువ ఉంటే దొడ్డురకం, ఎక్కువ ఉంటే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు.

◆ వడ్లను మిల్లులకు తరలించే క్రమంలోనూ గన్నీ సంచులపై సన్నరకం అయితే "ఎస్", దొడ్డు రకం అయితే "డీ" అని గుర్తులు పెడతారు.

పచ్చిధాన్యం తేకుండా అవగాహన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో 871 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి తేమ కొలిచే, ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు, గన్నీ సంచులతోపాటు ఈ సారి అదనంగా టార్పాలిన్లు (పట్టాలు), సన్నరకం ధాన్యాన్ని కొలిచే మైక్రోమీటర్‌ను కేటాయించనున్నారు. ధాన్యం రాకను బట్టి అదనంగా కేంద్రాలు పెంచే వెసులుబాటు కల్పించారు. అవసరం ఉన్న చోట కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు జిల్లా స్థాయి అధికారులకు తెలిపి మరికొన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఈసారి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నగదు జమ చేసేలా కసరత్తు చేస్తున్నారు. సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసుకునేలా ఆయా కలెక్టరేట్లలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాలను నిత్యం ఆకస్మికంగా తనిఖీ చేసేలా జిల్లాస్థాయి అధికారులతో పర్యవేక్షణ బృందాలను నియమించనున్నారు. పచ్చిగా ఉన్న పంటను కోయకుండా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి సాగు వివరాలు (ఎకరాల్లో..)

	నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
సన్నాలు	2,68,778	93,188	31,961
దొడ్డు	2,41,404	3,79,746	2,27,537
మొత్తం	5,10,182	4,72,934	2,59,498

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు, ధాన్యం రాక అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	కేంద్రాలు	సన్నాలు	దొడ్డు	మొత్తం
నల్గొండ	375	2,80,000	4,70,000	7,50,000
సూర్యాపేట	206	1,71,197	1,99,029	3,70,226
యాదాద్రి	290	32,363	4,00,000	4,32,363

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

–అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుచేస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సన్నాల కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నాం. మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వారి నేతృత్వంలో అక్రమాలకు తావులేకుండా కొనుగోళ్లు నిర్వహించనున్నాం.

అడగొద్దు మెనూ.. పెట్టిందే తిను!



○ ఇదీ వసతి గృహాల్లో పోషకాహార పట్టిక పరిస్థితి


భువనగిరి: భోజనం చేస్తున్న విద్యార్థులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచకపోవడంతో నిర్దేశిత మెనూ అటకెక్కింది. డైట్ బిల్లుల నెలల తరబడి మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు నాణ్యమైన సరకులు సరఫరా చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పప్పు, సాంబారే దిక్కు

గత రెండేళ్ల క్రితం ప్రస్తుత డైట్ ఛార్జీలపైన 25 శాతం పెంచాలని సర్కారు నిర్ణయించినా నేటికీ అమల్లోకి రాలేదు. రోజురోజుకూ నిత్యావసర సరకుల ధరలు పెరుగుతుండటంతో ప్రస్తుత డైట్ ఛార్జీల్లోనే సంక్షేమ అధికారులు నెట్టుకొస్తున్నారు. డబ్బులు చాలడం లేదని అధికారులు కోడిగుడ్లు, అరటి పండ్లు, ఇతర ఆహార పదార్థాల్లో కోత విధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు పప్పు, సాంబార్‌తోనే భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

నిధుల మంజూరులో తీవ్ర జాప్యం

ప్రతి మూడు నెలలకు ఒకసారి ముందస్తుగా డైట్ బిల్లుల చెల్లింపు, నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి. గత ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.30 కోట్ల నిధులు మంజూరైనా.. ఆరు నెలల బిల్లులు జమ కట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బిల్లులు మళ్లీ పెండింగ్‌లో పడ్డాయి. జిల్లాలోని ఎస్సీ వసతి గృహాలకు మొదటి త్రైమాసికానికి కు రూ.29 లక్షలు, రెండో త్రైమాసికానికి రూ.60 లక్షలు, ప్రీమెట్రిక్‌కు రూ.56 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 'బిల్లుల చెల్లింపులకు ఇబ్బంది లేదని, వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామ'ని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

జిల్లా పరిధిలో ఎస్సీ వసతి గృహాల గణాంకాలు

పాఠశాల వసతి గృహాలు :	19	విద్యార్థులు :	1400
కళాశాలకు సంబంధించి :	02	విద్యార్థులు :	250

ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి నెలకు చెల్లిస్తున్న మెస్ ఛార్జీలు(రూ..లలో)

మూడో నుంచి ఏడో తరగతి వరకు :	950
ఎనిమిది నుంచి పదో తరగతి వరకు:	1100
కళాశాల విద్యార్థులకు:	1500

పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ఒక వారం మెనూ ఇలా...

- మూడు దఫాలుగా కోడిగుడ్లు, అరటి పండు
- ఆదివారం చికెన్, సేమియా
- ఒక రోజు జీరారైస్, టమాటో రైస్
- రెండు సార్లు కిచిడి, పులిహోర
- ఒక రోజు వెజిటెబుల్ ఫ్రైడ్ రైస్, ఇడ్లీ
- కళాశాల విద్యార్థులకు ప్రతి ఉదయం టీ

కమనీయం.. లలితాదేవి అలంకారం


శ్రీలలితాదేవి అలంకరణలో అమ్మవారు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలో అనుబంధంగా కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల నాలుగో రోజు ఆదివారం శ్రీ లలితాదేవి అలంకారంలో అమ్మవారి దర్శనం కల్పించారు. పారాయణం, గాయత్రీ జపం, లలిత సహస్రనామార్చన, మధ్యాహ్నం నీరాజనం, మంత్ర పుష్పం నిర్వహించారు. సాయంకాలం శ్రీ దేవి చతుషష్టి ఉపచార పూజ, సహస్రనామార్చన నీరాజన మంత్ర పుష్పం చేపట్టారు.

'సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు'

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని తెలంగాణ ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి, తెలంగాణ ఉద్యమ ఫోరం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.చాంద్ అన్నారు. మండల కేంద్రంలో సిమెంటు పరిశ్రమ నిర్మాణ స్థలాన్ని ఆదివారం పరిశీలించి మాట్లాడారు. రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన ఓ సంస్థ ప్రస్తుతం సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించటం సమర్థనీయం కాదన్నారు. ఈ నెల 23న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దాసరి బుచ్చిరెడ్డి, నోముల శేఖర్, రమేశ్, మారయ్య, వెంకటేశం, నోముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కవాతు

భువనగిరి, న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పట్టణశాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో విజయదశమి ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత వీరసావర్కర్ చౌరస్తా నుంచి కవాతు పురవీధుల మీదుగా కార్యస్థలం స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణ వరకు సాగింది. కార్యక్రమంలో శివభారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ఉసులమరి వాసు ప్రధానవక్తగా పాల్గొన్నారు. భావితరాలకు మన పండగలు సంస్కృతి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విజయదశమి పర్వదినాన విశిష్టతను ఆయన వివరించారు. సనాతన ధర్మాన్ని పాటిస్తేనే మనకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శివకుమార్, ఆర్ఎస్ఎస్ పట్టణ కార్యవాహ ఏమికె శ్రీధర్, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ బాదం ప్రకాశ్ పాల్గొన్నారు.



అంతర్జాలం.. అందనంత దూరం

◆ డిజిటల్ పాఠాలకు తప్పని ఇబ్బందులు


తరగతి గదిలో డిజిటల్ పాఠాల బోధిస్తున్న ఉపాధ్యాయుడు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో ప్రవేశపెట్టిన డిజిటల్ బోధనకు అవాంతరాలు తప్పడం లేదు. పథకం ప్రవేశపెట్టి రెండేళ్లవుతున్నా నేటికీ పాఠశాలలకు ఇంటర్‌నెట్(అంతర్జాలం) సౌకర్యం కల్పించలేదు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మరి కొన్ని చోట్ల ఉపాధ్యాయులే తమ సెల్‌ఫోన్‌లోని హాట్‌స్పాట్ ద్వారా డేటా అందిస్తూ పాఠాలు బోధిస్తున్నారు.

సమస్య ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించేందుకు 2022-23 విద్యాసంవత్సరంలో డిజిటల్ పాఠాలను ప్రవేశపెట్టారు. విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై వీడియోలు చూపిస్తూ బోధించడం ద్వారా వారిలో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఇలా బోధన చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలుకాలేదు. 2023 మార్చిలో కొన్ని పాఠశాలలకు డిజిటల్ బోర్డులు(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్-ఐఎఫ్‌పీ) మంజూరుచేసింది. అప్పటికే విద్యాసంవత్సరం పూర్తవుతుండటంతో కొన్నిచోట్ల వాటిని నామమాత్రంగా ఉపయోగించారు. మరి కొన్ని చోట్ల భద్రపరిచి 2023-24 విద్యాసంవత్సరం ఆరంభంలో ఏర్పాటుచేశారు. అదే విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలలకు బీఎస్ఎన్ఎల్ కేబుల్ ద్వారా ఇంటర్‌నెట్ కల్పిస్తామని చెప్పారు. నేటికీ కల్పించలేదు. కొందరు ఉపాధ్యాయులు హాట్‌స్పాట్ ఉపయోగిస్తున్నా నెట్‌వర్క్ సిగ్నల్ లేకుంటే పాఠాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

రక్షణ లేక అవస్థలు

ఒక్కొక్కటి సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.5.50 లక్షల విలువ చేసే ప్యానల్స్‌ను పాఠశాలల్లో భద్ర పరచడమంటే ప్రధానోపాధ్యాయులకు కత్తిమీద సాములాంటిదే. అనేక పాఠశాలలు ఊరికి దూరంగా ఉండటంతో వాటికి రక్షణ లేకుండా పోతోంది. గతంలో వేసవి వచ్చిందంటే పాఠశాలల్లో కంప్యూటర్స్‌తోపాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యేవి. ఇపుడు ఇంత విలువైన ప్యానల్స్‌ను జాగ్రత్తగా ఉంచడం కష్టంగానే ఉందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులు కాపలాదారును నియమించారు. తర్వాత ఊసే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పాటు రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.

జిల్లా	ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య	మంజూరైన ఐఎఫ్‌పీలు
సూర్యాపేట	210	644
నల్గొండ	289	875
యాదాద్రి	183	538

ఆంధోల్ మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి: ఎంపీ


ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దేవాలయ ఈవో మోహన్‌బాబు

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీ ఆంధోల్ మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దండుమల్కాపురం శివారులోని ఆంధోల్ మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. దేవాలయ ఈవో మోహన్‌బాబు, ప్రధాన అర్చకుడు వల్లూరి శివ ప్రసాద్‌శర్మ ఎంపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. దసరా పండుగకు వాహనాలు పూజల కోసం గత ఏడాది కంటే అధికంగా వచ్చే అవకాశం ఉందని దేవాలయ ఈవో మోహన్‌బాబు ఎంపీకి తెలిపారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

ఆదమరిస్తే అంతే సంగతి...

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం ఎర్రబెల్లితండా నుంచి రామునిగుండ్లతండాకు వెళ్లే మార్గంలోని బునాదిగాని కాల్వ ప్రమాదకరంగా మారింది. బీబీనగర్ నుంచి సుమారు పది తండాలకు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం ఈ మార్గంలో బునాదిగానికాల్వ పై గతంలో కల్వర్టు నిర్మించారు. ఇటీవల సదరు రోడ్డుపై మట్టిపోయడంతో కల్వర్టు రక్షణ వలయం దాదాపు మునిగిపోయింది. రోడ్డుపై వెళ్లేప్పుడు వాహనదారులు కాస్తా అదుపు తప్పినా కాల్వలో జారి పడే ప్రమాదం ఉంది. దీనికి తోడు కాల్వకు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరిగి దగ్గరకు వచ్చే వరకు అక్కడ కాల్వ ఉన్నట్లు గుర్తించలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి అక్కడ కాల్వకు పటిష్ఠమైన రక్షణ వలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


బీబీనగర్ మండలం ఎర్రబెట్టితండా నుంచి రామునిగుండ్లతండాకు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా బునాదిగాని కాల్వ

అక్రమంగా తరలిస్తున్న 50 గోవుల స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోని హనుమాన్‌జంక్షన్ నుంచి హైదరాబాదుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 50 గోవులను ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం పోలీసులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు.



ఎన్టీఆర్‌జిల్లా నెమలి వేణుగోపాలస్వామి ఆలయ కోనేరు వద్ద సేద తీరుతున్న ఆవులు


ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెనుగొలను వద్ద అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా లారీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లారీని స్వాధీనం చేసుకొని ఆవులను నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని గోశాలలో ఉంచామని పేర్కొన్నారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం నర్సింగ్ తండాకు చెందిన డ్రైవర్ బాణావత్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర పెంచేసి.. రూ.లక్షలు కాజేసి

★ వైటీపీఎస్ కేంద్రంగా కమీషన్ దందా

★ ఓ ప్రజాప్రతినిధి హస్తంపై ఆరోపణలు





ఈనాడు, నల్గొండ: అదీ.. ఉమ్మడి జిల్లా సరిహద్దులో ఉన్న ఓ నియోజకవర్గం. సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతం. సర్కారు చేపడుతున్న నిర్మాణాలకు రోజూ రెండు వేల టన్నుల కంకర తరలుతోంది. ఇక్కడే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అక్రమానికి చేయిచాచాడు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే టన్ను కంకర లోడుకు రూ.200 వరకు పెంచి కమీషన్ దండుకుంటున్నాడు. ఈ లెక్కన నిత్యం రూ.నాలుగు లక్షల వరకు కమీషన్ రూపంలోనే ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ వ్యయం పెరిగి ప్రజాధనం దుర్వినియోగమవుతున్నా.. అధికార వర్గాలు మాత్రం 'చూసీ'చూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

గతంలో తరలింపు ఇలా..

యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్) నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంటుండటంతో జిల్లా మంత్రులు ప్రత్యేక దృష్టిసారించి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఇటీవలే పనుల్లో వేగం పెంచారు. ఇప్పటికే ఇక్కడ రెండు యూనిట్లు పూర్తికాగా.. త్వరలోనే మరో రెండింటినీ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైటీపీఎస్‌లో జరిగే నిర్మాణ పనులకు నిత్యం 1500 టన్నుల నుంచి రెండు వేల టన్నులకు పైగా కంకర కావాల్సి ఉంటుంది. నిర్మాణాలు, రహదారులు, ఇతరత్రా పనులకు స్థానికంగా మరో 500 టన్నుల అవసరం ఉంటుంది. ఈ పనులకు గత నాలుగైదు నెలల వరకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల క్రషర్‌లతో పాటు హైదరాబాద్ నుంచి కంకర వచ్చేది. టన్నుకు రూ.550 నుంచి రూ.600 వరకు అధికారులు కొనుగోలు చేసేవారు.

చక్రం తిప్పారిలా..

కొన్ని నెలలుగా హైదరాబాద్‌తో పాటు స్థానికంగా ఉన్న పలు క్రషర్ల నుంచి వస్తున్న కంకరను వైటీపీఎస్‌కు సరఫరా చేయొద్దని సదరు ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారు. పక్క నియోజకవర్గంలో ఉన్న మరో పార్టీకి చెందిన ఓ భారీ మిల్లు నుంచి కమీషన్ తీసుకొని అక్కడి నుంచే ప్లాంటుకు కంకర తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ దందాతో వైటీపీఎస్ నిర్మాణం వ్యయం పెరిగి ప్రభుత్వంపై భారం పడుతుంది. మరోవైపు సదరు నియోజకవర్గ కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న క్రషర్లను సైతం మూసివేయించి సామాన్యుల అవసరాలకూ ఆ మిల్లు నుంచే కంకర వచ్చేలా చేస్తున్నారని అక్కడి బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల కాలంలో సుమారు ఆరు క్రషర్లు మూత పడటం విశేషం. "నాలుగైదు నెలల వరకు టన్నుకు రూ.550 చొప్పున కొనుగోలు చేశాం. మేం తరచూ కొనుగోలు చేసే క్రషర్‌ను అధికారుల వేధింపులతో దాని యజమాని మూసేశారు. హైదరాబాద్ సమీపంలో నుంచి వచ్చే కంకర సైతం ఇదే ధరతో కొనుగోలు చేశాం. అక్కడి నుంచి రావొద్దని చెప్పారట. ఇప్పుడు రూ.780 నుంచి రూ.800 వరకు కొనుగోలు చేస్తున్నాం. అయినా గతంతో పోలిస్తే నాణ్యతగా ఉండటం లేద"ని బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుడొకరు 'ఈనాడు'కు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన కంకరను తక్కువ ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతం కంటే ఎక్కువ ధరకు కంకర కొంటున్న విషయమై వైటీపీఎస్ సీఈ సమ్మయ్యను 'ఈనాడు' సంప్రదించగా.. ఇసుక, కంకరకు తాము ఒకేసారి కాంట్రాక్టు ఇస్తామని, దీన్ని నిత్యం భెల్ అధికారులు, గుత్తేదారు పర్యవేక్షణ చేస్తారని, ఎంత ధరకు కొంటున్నారో తనకు తెలియ'ని వెల్లడించారు.

గొంతులో ఇరుక్కుపోతున్నాయ్ జాగ్రత్త..!



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చిన్నారులు ఆడుకుంటూ.. తమ చేతిలో ఉన్న వస్తువులను నోట్లో పెట్టుకోవడం సర్వసాధారణం. ఒక్కోసారి ఆ వస్తువులను పొరపాటున మింగడంతో గొంతు, ఆహార నాళాల్లో ఇరుక్కుపోయి.. ఊపిరాడక మరణించిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. గొంతులో ఆహార పదార్థాలు ఇరుక్కున్నప్పుడు సరైన అవగాహన లేకపోవడంతో పలువురు సమస్యను జటిలం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 30 మందికి పైగా గొంతు, నాళాల్లో పదార్థాలు, వస్తువులు ఇరుక్కుని ఆసుపత్రిలో చేరుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

◆ చిన్నారులకు గొంతులో ఇరుక్కునే పరిమాణంలో ఉండే నాణేలు, వస్తువులు ఇవ్వకూడదు.

◆ ఆహార నాళాల్లో అల్సర్లకు దారి తీసే అయస్కాంతం, బ్యాటరీలు, పిన్నీసులు వంటి పదునైన వస్తువులను పిల్లలకు అందుబాటులో ఉంచరాదు.

◆ మాంసాహారంతోపాటు గట్టిగా ఉండే పదార్థాలను మెత్తగా నమలాలి.

◆ క్యారెట్ వంటి ఆహార పదార్థాలను తురిమి చిన్నారులకు అందించాలి.

◆ పిల్లల మెడలో సన్నటి గొలుసులు, నెక్లెస్‌లు వేయకూడదు.

◆ చిన్నారులు ఆడుకోవడానికి నాణేలు, కాసులు ఇవ్వొద్దు.

◆ చిన్నారుల గొంతులో ఏదైనా ఇరుక్కుపోతే పొట్టపై ఒత్తకూడదు. పొట్ట లోపల గాయాలు కావొచ్చు.

◆ గొంతులో ఏదైనా ఇరుక్కుపోయినట్లు అనిపిస్తే తలపై తట్టకూడదు.

◆ గట్టిగా దగ్గడం వల్ల గొంతులో ఇరుక్కున్న వస్తువులు బయటపడే అవకాశం ఉంది.

సంఘటనలు ఇలా..

☛ రెండేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా రాజానాయక్ తండాలో ఓ వ్యక్తి మేక మాంసం ఎముక గొంతులో ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయారు.

☛ యాదాద్రి భువనగిరి జిల్లా కట్టంగేణి గ్రామానికి చెందిన వృద్ధుడికి దంతాలు లేక నమలకుండానే మాంసం ముక్క మింగారు. వైద్యులు అతి కష్టం మీద శస్త్రచికిత్స చేసి తీశారు.

☛ గుర్రంపోడుకు చెందిన ఓ మహిళ నాటు మందు మింగారు. అది గొంతులో అడ్డుపడగా.. నీరు తాగడంతో మరింత ఉబ్బి పోయింది. మందుముద్దను వైద్యులు ఎండోస్కోపీ ద్వారా ముక్కలుగా చేసి పొట్టలోకి తోశారు.



☛ పెద్దవూర మండలానికి చెందిన బాలుడు గత నెలలో రెండు రూపాయల నాణేన్ని మింగడంతో మిర్యాలగూడలో ఆధునిక చికిత్స విధానంతో బయటకు తీశారు.


బలవంతంగా తీయొద్దు



– డాక్టర్ ముప్ప శ్రీహర్ష, గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ సర్జన్, మిర్యాలగూడ

పిల్లలు, పెద్దల గొంతు, ఆహార నాళాల్లో ఏదైనా ఇరుక్కుపోయిందని గమనించిన వెంటనే బలవంతంగా తీసేందుకు ప్రయత్నించకుండా తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. సూక్ష్మ పరికరాలను ఉపయోగించి.. వస్తువు స్థితిని గమనించి.. జాగ్రత్తగా బయటకు తీయడమా.. పొట్టలోకి నెట్టడమా చేస్తాం. గత నెలలోనే నలుగురికి ఆధునిక చికిత్స ద్వారా ఇరుక్కుపోయిన వస్తువులను బయటకు తీశాం.

మొదలైన దసరా రద్దీ



జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తూ బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌కు అప్పుడే దసరా పండుగ కళ వచ్చింది. ఆదివారం రోజున స్థానిక వస్త్రాలు, గాజులు, చెప్పులు, అలంకరణ వస్తువులు విక్రయించే దుకాణాలు జనంతో కిక్కిరిశాయి. సంత కూడా ఇదే రోజున నిర్వహిస్తుండడంతో ఎక్కడ చూసినా కొనుగోళ్లు చేస్తున్న జనమే కనిపించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లో నివాసముండే ఈ ప్రాంతవాసులు కుటుంబాలతో సొంతూళ్లకు కార్లలో ప్రయాణం కావడంతో జాతీయ రహదారిపై రద్దీ ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో వాహనాలు బారులు తీరాయి. దీనికి తోడు సరుకులు రవాణా చేసే వాహనాలు, ఆటోలు తదితర వాహనాలు రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ రద్దీతో సమస్యలు ఏర్పడకుండా క్రమబద్ధీకరించారు. ఇదే రద్దీ దసరా పండగ వరకు కొనసాగే అవకాశముంది.

మృత్యువులా దూసుకొచ్చిన లారీ: ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

యాచారం, న్యూస్‌టుడే: కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వ్యక్తిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ రోడ్డు ప్రమాద సంఘటన రంగారెడ్డి జిల్లా మాల్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా వెంకటేశ్వర నగర్ నివాసి గున్నాల భాస్కర్(45) వారాంతపు సంతల్లో చిల్లర వ్యాపారులకు హోల్‌సేల్‌గా కూరగాయలు సరఫరా చేస్తాడు. నల్గొండ గట్టుప్పల్‌లో శనివారం నిర్వహించిన సంతలో కూరగాయలు సరఫరా చేసి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. మాల్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ.. ఆటో ఢీకొట్టడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితో వస్తున్న అతని చెల్లెలు జయమ్మ, అక్క వెంకటమ్మ, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వీరంతా రోడ్డు ప్రమాదం పాలయ్యారు. భాస్కర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు, భార్య ఉన్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ చెప్పారు.

వీవీఐపీల విడిదికి కొండపైనే విల్లాలు



యాదాద్రిలో ప్రెసిడెన్షియల్ సూట్ల సముదాయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహ పుణ్యక్షేత్రంలో వీవీఐపీలు బస చేసేందుకు వారికి అనుగుణంగా ప్రత్యేక ప్రాంగణంలో విల్లాలు నిర్మించిన విషయం తెలిసిందే. ఈ క్షేత్రాభివృద్ధిలో భాగంగా దాతల ఆర్థిక సహకారంతో ప్రెసిడెన్షియల్ సూట్ల పేరిట 14 విల్లాలు, ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించారు. వీటికి అయిన వ్యయం రూ.104 కోట్లు దాతలు సమకూర్చినవే. యాదాద్రి కొండకింది ఉత్తర దిశలో పదమూడు ఎకరాల కొండపైన విడిది విల్లాలు ఏర్పాటయ్యాయి. భద్రత కట్టుదిట్టం కోసం రక్షణ గోడ నిర్మించారు. 14 విల్లాలో మొత్తం 70 సూట్లు ఉన్నాయి. ఒక్కో విల్లాలో ఐదు సూట్లు ఐదు కుటుంబాలు బస చేసేలా అవసరమైన వసతులతో వీటిని వైటీడీఏ పర్యవేక్షణలో అద్దె కిస్తారు. ఒక రోజుకు ఒక్క సూట్ అద్దె రూ.3 వేలు.

భూమిపై పెట్టుబడితో భరోసా: ఎమ్మెల్యే



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, చిత్రంలో సినీ నటులు శ్రీకాంత్, తరుణ్

చింతపల్లి, న్యూస్‌టుడే: భూమి మీద పెట్టుబడి పెడితే భవిష్యత్తులో భరోసా కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్ర సమీపంలో స్థిరాస్తి రంగం సంస్థలైన శ్రీమిత్ర, ఆరు ఆధ్వర్యంలో సాయి సన్నిధి వెంచర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చింతపల్లి సమీపంలోని కుర్మేడ్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ పోతుందని, సమీపంలో వైజాగ్ కాలనీ ఉండటంతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. సాయిబాబా దేవాలయం సమీపంలో వెంచర్ ఏర్పాటు చేసి మధ్య తరగతి వారికి ప్లాట్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్ అన్నారు. కార్యక్రమంలో శ్రీమిత్ర ఛైర్మన్ ఎం.వీ.చౌదరి, తేజ నివాస్, తేజగోవింద్, ఆరు నిర్వాహకులు రవితేజ అఖిల్, సికేందర్, శైలేందర్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, ఉజ్జిని యాదగిరిరావు, సాయిబాబా దేవాలయ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ, దొంతం సంజీవ రెడ్డి, అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, నటుడు ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

కన్నవారి కలలు ఫలించె.. కొలువు పల్లెవించె..!

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

తల్లిదండ్రులు రోజువారి వ్యవసాయ కూలీలు. తాము పడుతున్న కష్టాలు పిల్లలు పడొద్దని భావించి ఉన్నత చదువులు చదివించారు. నిరంతరం శ్రమించి, వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన కన్నవారి ఆశయాలను గుర్తించి నెరవేర్చారు నూతనకల్ మండలంలోని పలు పల్లెల యువత. నిర్దిష్ట లక్ష్యం, ప్రణాళిక, వారికి ఇష్టమైన రంగాల్లో స్థిరపడాలన్న కోరికతో చదివి ఉద్యోగాలు సాధించారు. ఇటీవల వెలువడిన పలు ప్రభుత్వ ఉద్యోగ ఫలితాల్లో మండలంలోని యువతీయువకులు కొలువులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కోర్టు ఉద్యోగం మానేసి.. – గంట వెంకటేశ్, దిర్శన్‌పల్లి



అమ్మానాన్నలు గంట సాలయ్య-వెంకటమ్మ. రోజువారి కూలీ పనుల చేస్తూ ఎంతో కష్టపడి నన్ను చదివించారు. ఎంఏ బీఈడీ పూర్తి చేసి గ్రూప్స్‌కి తర్ఫీదు పొందా. ఇటీవల తుంగతుర్తి న్యాయస్థానంలో క్లరికల్ ఉద్యోగం సాధించా. అది మానేసి హాస్టల్ వెల్ఫేర్ కొలువుకు సన్నద్ధమై రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించా.

అమ్మానాన్న కళ్లల్లో ఆనందం చూశా.. – తన్నీరు ఉమేష్, యడవెల్లి



విద్యుత్తు శాఖలో హెల్పర్‌గా(రోజువారి కూలీ) పనిచేస్తున్న నాన్న కష్టం చూసి.. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేశా. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ పూర్తయిన అనంతరం గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యా. తర్వాత ఏఈఈగా ఉద్యోగం.. నెక్కొండలో పోస్టు వచ్చింది. అమ్మానాన్నల కళ్లల్లో ఆనందం చూశా.

పేదరికాన్ని జయించా



– రచ్చ సందీప్, చిల్పకుంట్ల

తల్లిదండ్రులు జీవనోపాధి కోసం సూరత్ వెళ్లి.. కరోనా సమయంలో స్వగ్రామానికి వచ్చారు. చేనేత కార్మికులుగా పని చేస్తూ అమ్మానాన్నలు రచ్చ వెంకటేశ్వర్లు,-నిర్మల నన్ను చదివించారు. పేదరికం నుంచి బయటపడాలని కసితో చదివి విజయం సాధించా. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్(ఏఈఈ) ఉద్యోగం సాధించి మహబూబాబాద్‌లో విధుల్లో చేరా.

సొంత జిల్లాలో కొలువు

– నామాల భవాని, చిల్పకుంట్ల



వ్యవసాయ కళాశాలలో చేరి ఇంజినీరింగ్ చేస్తున్నప్పుడే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రణాళికలు వేసుకొని లక్ష్య సాధనకు కృషి చేశా. అమ్మానాన్నల ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ ఉద్యోగం సాధించి ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో విధుల్లో చేరా. సొంత జిల్లాలో పనిచేస్తున్నందుకు ఆనందంగా ఉంది.

తల్లిదండ్రుల కల నెరవేర్చా

– రాచమళ్ల శ్రావణి, పెదనెమిల



అమ్మానాన్నలు రాచమళ్ల శ్రీనివాస్, లక్ష్మీలకు ముగ్గురు ఆడపిల్లలం. నాకు రెండేళ్ల కిందట వివాహమైంది. 'పెద్ద కుమార్తెవు.. విజయం సాధిస్తే చెల్లెల్లకు ఆదర్శంగా నిలుస్తావు' అన్న అమ్మానాన్నల మాటలు.. భర్త ప్రోత్సాహంతో ముందుకు సాగాను. ఏఈఈ కొలువు సాధించి సొంత మండలంలోనే విధుల్లో చేరా. తల్లిదండ్రుల కల నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది.

పట్టుదలతో సాగితే విజయం ఖాయం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయాలు ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. మూడు రోజుల పాటు 24 మ్యాచ్‌లు జరుగుతాయని, ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

★ మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. * ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి రహమాన్ అలీ



మోత్కూరులో సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా చింతల పురస్కారం అందుకుంటున్న రహమాన్ అలీ(పాతచిత్రం)

మోత్కూరు, తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఒకేవ్యక్తి అనేక రంగాల్లో ప్రతిభ కనబర్చడం కొందరికే సాధ్యం. ఆ కోవకు చెందిన వారు తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన మహ్మద్ రహమాన్ అలీ. క్రీడోపాధ్యాయుడిగా ఈయన చాలాకాలం మోత్కూరులో పనిచేసి, అక్కడే ఉద్యోగ విరమణ పొందారు. రంగస్థల నటుడిగా, దర్శకుడిగా, ప్రయోక్తగా అనేక నాటకాలు, నాటికలు ప్రదర్శించి మన్ననలు అందుకుంటున్నారు. సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో భాగంగా ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లో అనేక ప్రదర్శనలిచ్చి ప్రజలను అక్షరాస్యత వైపు మళ్లించారు. మద్యపాన నిషేధ కమిటీ ఆధ్వర్యంలో నాటకాలు, ఉపన్యాసాలతో జనాల్లో చైతన్యం తీసుకొచ్చారు. స్కౌట్ మాస్టర్‌గా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ పసిఫిక్ జాంబూరి, యూనియన్ క్యాంపు, బ్యాడ్జ్ శిక్షణలో పాల్గొని మాజీ ప్రధాన మంత్రి మొరార్జీదేశాయ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. రచయితగా, చిత్రకారుడిగా అనేక సామాజిక అంశాలపై బొమ్మలు గీసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు.

నిరక్షరాస్యులను నటులుగా తీర్చిదిద్ది


ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీలో ఆధునిక నటనలో శిక్షణ పొందిన రహమాన్ అలీ చదువురాని స్థానిక గ్రామీణులను నటులుగా తీర్చిదిద్దారు. వారితో కలిసి 'అన్నాచెల్లెలు, కీర్తిశేషులు, విషాదాంతం, పల్లెపడుచు, పూలరంగడు, నీలిదీపాలు' వంటి నాటకాలు, పశ్చాత్తాపం, చీకటి తెరలు, అంతర్వాణి, వెంకన్న కాపురం, ఊబి, కళ్లు, ఛాయ, ఊరుమ్మడి బతుకులు తదితర నాటికలను కడప, హైదరాబాద్ రవీంద్రభారతి, తదితర చోట్ల ప్రదర్శించారు. దొరోరి బంగ్లా, కొడుకు పుట్టిండు నాటికలు దూరదర్శన్‌లో, 'ప్రేమ పక్షులు' నాటకం రేడియోలో ప్రసారమయ్యాయి. రాష్ట్ర, అఖిలభారత స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చిన ఆయనకు ఎన్నో పురస్కారాలు లభించాయి. పరుచూరి బ్రదర్స్, సినీ నటుడు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, దాసరి నారాయణరావు, తదితర సినీ ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 'నటన, ఆటల్లో తర్ఫీదు ఇవ్వడం తనకెంతో ఇష్టమని, అందుకే అనేక మందిని ఆయా రంగాల్లో తీర్చిదిద్దాన'ని రహమాన్ అలీ తెలిపారు.

ధనలక్ష్మి అవతారం.. కరెన్సీ నోట్ల అలంకారం



చౌటుప్పల్‌లో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఆదివారం ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. నిర్వాహకులు రూ.45 లక్షల విలువైన కరెన్సీ నోట్లను పోగు చేసి దండలుగా మార్చి అమ్మవారిని, మండపాన్ని అలంకరించారు. హారతి పళ్లెంలో నోట్ల కట్టలను పేర్చారు. ఎటు చూసినా 100, 200, 500 రూపాయల నోట్లు కనిపించేలా తీర్చిదిద్దారు. - చౌటుప్పల్, న్యూస్‌టుడే

ఆడదూడలు పుట్టేలా.. కృత్రిమ గర్భధారణ



నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కృత్రిమ గర్భధారణ(ఏఐ)తో ఆడదూడలే పుట్టేలా చేస్తున్న ప్రయోగాలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో విజయవంతమయ్యాయి. లింగ నిర్ధారిత వీర్య నాళికలతో పశుగణాభివృద్ధి సంస్థ ఈ ఘనత సాధించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 58 ఆడదూడలు పుట్టాయి. తక్కువ ఖర్చుతో 90 శాతం కచ్చితత్వంతో అధిక పాల దిగుబడి సామర్థ్యం గల మేలు జాతి ఆడదూడలు పుట్టించి పాడి రైతుల ఆదాయం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ను తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో గత ఏడాదిలో లింగ నిర్ధారిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ పథకంలో 2078 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. ఈ విధానంలో 90 శాతం ఆడ దూడలు పుట్టే అవకాశం ఉంది. ఆడ దూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశుపోషకులకు ఆదాయం సమకూరుతుంది.

మూడేళ్లకే పాల దిగుబడి..

ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం లింగ నిర్ధారణ వీర్యం కలిగిన స్ట్రాని రైతులకు రాయితీపై అందిస్తోంది. ధర రూ. 675 కాగా రైతు వాటాగా రూ.250 చెల్లించాలి.

ఉమ్మడి జిల్లా వివరాలు..

★ ఆడదూడలు పుట్టేలా కృత్రిమ గర్భధారణ (ఏఐ) చేసిన పశువులు: **2078**

★ ఇప్పటికి చూడిదాల్చినవి: **1183**

★ ప్రస్తుతం పుట్టిన ఆడదూడలు: **58**

★ ఏఐతో లభ్యమయ్యే జాతులు: **గేదెలు ముర్రా, ఆవుల్లో సాహివాల్, హెచ్.ఎఫ్, జెర్సీ**

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

–ఎం.రాజశేఖర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి, నల్గొండ

పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేస్తే మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతోంది. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడానికి ఇది అనువైన కాలం. డీఎల్‌డీఏ ద్వారా చేపట్టే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

అప్పాలు కాల్చేదెలా..!



భానుపురి, న్యూస్‌టుడే:

వంట నూనెల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. పండగ సమయంలో సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో ఆయా కంపెనీలు ధరలను గణనీయంగా పెంచేశాయి. పది, పదిహేను రోజుల వ్యవధిలో నూనెల ధరలు కిలోకు రూ.20-రూ.30 వరకు పెరిగాయి.

పెంపు ఇలా..

గత నెల 13న కేంద్రం ప్రభుత్వం వంట నూనెల దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచింది. దీంతో లీటర్ పొద్దుతిరుగుడు రూ. 135, పామోలిన్ రూ.125కు చేరింది. గత నెల 13న పోలిస్తే ఒక్కో లీటర్‌పై రూ.20 వరకు పెరిగింది. మరికొద్ది రోజుల్లో మరో రూ.5 వరకు పెరిగే అవకాశముంది. పెంపు విషయంలో పలు కంపెనీలు సంయమనం పాటించగా కొన్ని మాత్రం పెంచేశాయి.

మన నూనెలకు ధరలు

మన దేశంలో ఉత్పత్తయ్యే వేరుసెనగ, సోయాబీన్ తదితర నూనెల ధరలు విదేశీ ఉత్పత్తులతో సమానంగా పెరిగాయి. సెప్టెంబరు 10 వరకు లీటర్ రైస్‌బ్రాన్ నూనె ప్యాకెట్ రిటైల్ ధర రూ. 120 వరకు ఉండగా ప్రస్తుతం రూ.135కి పెంచారు. వేరుసెనగ నూనె ధర రూ.150కు నుంచి రూ.155 వరకు పెరిగింది. దిగుమతి సుంకం పరిధిలోకి రాని దేశీయ నూనెల ధరలను సైతం పెంచడంతో సామాన్యులకు భారంగా మారింది.

దీనికి అధికం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కువగా పొద్దుతిరుగుడు నూనె వినియోగిస్తారు. గృహ, వాణిజ్య అవసరాలకు ప్రతి నెలా 4200 మెట్రిక్ టన్నుల వివిధ రకాల వంట నూనెలు వాడుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. అత్యధికంగా పొద్దుతిరుగుడు 2600 మెట్రిక్ టన్నులు, పామోలిన్ 900 ఎంటీలు, వేరుసెనగ, తవుడు, ఇతర నూనెలు 700 ఎంటీలు ఉంటాయి. రోజువారీగా మారుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుంటే భారం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

అవినీతిపై శ్వేత పత్రం విడుదల చేయాలి: సీపీఎం



సీపీఎం జెండా ఆవిష్కరణ చేస్తున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదాద్రి దేవస్థానం అభివృద్ధి పేరుతో వైటీడీఏ భారీగా అవినీతికి పాల్పడినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించిందని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దకందుకూరులో జరిగిన ఆ పార్టీ మండల మహాసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అవినీతిని వెలికితీయకుండా మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో భాజపా మరోమారు అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ప్రజావ్యతిరేక విధానాలు తీసుకువస్తోందని మండిపడ్డారు. అంతకు ముందు పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీమగాని రాములు, బబ్బూరి పోశెట్టి, మంగ నర్సింహులు, బాలరాజు, కాలే స్వామి, సత్యనారాయణ, పెంటారెడ్డి, జోగు శ్రీనివాస్, మాదవి, శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే గంధమల్లకు గోదావరి నీళ్లు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవ వల్లే మల్లన్నసాగర్ నుంచి గంధమల్ల చెరువు నిండి మత్తడి దూకుతుందని, ఇది మాజీ సీఎం కేసీఆర్ పుణ్యమంటూ భారాస శ్రేణులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో గంధమల్లకు నీరు తెచ్చిన వారైతే అలుగెందుకు పారలేదు, ఆలేరు పెద్ద వాగు, బిక్కేరు వాగు ఎందుకు పారలేదు, గుండాలకు ఎందుకు నీరు రాలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి భరత్, పెలిమెల్లి శ్రీధర్, హేమేందర్, బందారు బిక్షపతి, రాజేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.



మార్కెట్ కార్యాలయం

యార్డు లేక యాతన

☛ ఉన్న చోట అసౌకర్యాల జాతర

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి నూతన మార్కెట్ యార్డు నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. యాదాద్రి జిల్లాలోనే నాడు అతి పెద్ద మార్కెట్‌గా పేరున్న భువనగిరి మార్కెట్‌ను పాలకులు పట్టించుకోని కారణంగా అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది. నాడు ఏర్పాటు చేసిన పాత, కొత్త మార్కెట్ యార్డులు ఉన్నప్పటికీ రెండింటిలోనూ రైతులు, లావాదేవీలకు అనుకూలంగా లేకపోవడంతో ప్రతి సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారు. పాత మార్కెట్ యార్డులో వ్యాపారులు నివాస గృహాలతో పాటు దుకాణాలు ఉండటంతో ఇతర వ్యాపార కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొత్త మార్కెట్ యార్డులో భారీ గోదాముల నిర్మాణంతో సీజన్‌లో ధాన్యం నిల్వ చేసుకునే వీలు లేకుండా పోయింది. ప్రాంగణంలోని రైతు విశ్రాంతి భవనం కార్యాలయానికి వినియోగిస్తుండటం గమనార్హం. ఉన్న షెడ్లలో మిల్లర్లు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడంతో ప్రతి సీజన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గంజ్ మార్కెట్‌లోని పాత మార్కెట్ కార్యాలయం భవనాన్ని కూల్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ నూతన కార్యాలయ భవనం నిర్మాణానికి నోచుకోకపోవడం గమనార్హం.

ఇబ్బందులు ఇలా..

సీజన్‌లో రైతుల ఇబ్బందులను తొలగించేందుకు అన్ని సదుపాయాలతో మార్కెట్‌ను నిర్మించాలన్న లక్ష్యంతో భారాస ప్రభుత్వం గూడూరు, అనంతారం గ్రామాల శివారులోని సర్వే నంబర్ 69లో 17 ఎకరాల భూమిని కేటాయించింది. అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్ యార్డు నిర్మించాలని ప్రతిపాదించింది.



కొత్త మార్కెట్ యార్డు స్వాగత తోరణం

☛ ప్రస్తుత స్థలంలో కొంత మేరకు ప్రహరీ నిర్మించి వదిలేశారు. భూమిని యార్డులో నిర్మించే నిర్మాణాలకు అనువుగా మార్చాల్సి ఉంది. రూ.1.50 కోట్లతో ప్రహరీ నిర్మించేందుకు నిర్ణయించినప్పటికీ నేటికీ పూర్తి కాలేదు. భారాస హయాంలో యార్డులో గోదాములు, షెడ్లు, సీసీ రోడ్లు, విద్యుదీకరణ, నీటి సదుపాయం కోసం రూ.6 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినప్పటికీ మంజూరు కాలేదు.

☛ పట్టణంలోని పాత మార్కెట్ యార్డు మూడు ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సింహభాగం వ్యాపారుల ఇళ్లు ఉన్నాయి. గతంలో వేసిన సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. పెద్ద గంజ్‌లో భారీ వాహనాలు నిలుపుతుండటం, భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేస్తుండటంతో సీజన్‌లో రైతులు ధాన్యం, ఇతర ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు చోటు లేకుండా పోతోంది.

☛ విద్యానగర్‌లో 7.17 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న యార్డులో మూడు పెద్ద గోదాములు ఉన్నాయి. వీటిలో రెండు పౌరసరఫరాల శాఖ వినియోగిస్తోంది. మరొక గోదాంలో ఎంఎల్ఎస్ గోదాం ఉంది. దీంతో స్థలం లేకుండా పోయింది. సీజన్‌లో సరుకులు నిల్వ చేసుకునేందుకు స్థలం లేదు.

☛ మార్కెట్ కార్యదర్శి సుదర్శన్‌ను వివరణ కోరగా ప్రహరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరణ ఇచ్చారు. నిర్మాణాలకు అధికారికంగా నిధులు మంజూరుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపడతామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80082 78928 80085 74375

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే:

? యాదగిరిగుట్ట-ప్రశాంత్‌నగర్‌లో సీసీ రోడ్డు శిథిలమైంది. సీసీ రహదారి నిర్మాణం చేయాలి. - విజయ్, యాదగిరిగుట్ట.

✔ త్వరలో పనులు చేపడతాం. - ఎరుకల సుధ, పుర అధ్యక్షురాలు

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం ప్రధాన రహదారి పక్కన ఉన్న మంచి నీటి పైపులైన్ లీకై నీరు కలుషితమవుతోంది. వెంటనే మరమ్మతులు చేయాలి. - రవి, బొమ్మలరామారం.

✔ గ్రామ పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. - పద్మజ, పంచాయతీ కార్యదర్శి

సంక్షిప్త సమాచారం

నియామకం.. వలిగొండ: మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన జోగు అంజయ్య తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అందజేశారు.

మోత్కూరు: సమాచారహక్కు చట్టం యాక్టివిస్టు సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా మోత్కూరు పురపాలికలోని జామచెట్లబావికి చెందిన బీసు భాస్కర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన తెలిపారు.

ఎన్నిక.. మోత్కూరు: తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీ మెసెంజర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోత్కూరుకు చెందిన కందుకూరి యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఆదివారం మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందని ఆయన చెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా ప్రభుత్వంతో కొట్లాడుతున్నందుకే తనను మూడోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని పేర్కొన్నారు.

భారాస గ్రామశాఖ.. ఆలేరు: ఆలేరు మండలం సాయిగూడెం గ్రామ భారాస కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గంగధారి సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఇంజ రాజు, ఎం.శ్రీను, సెక్రటరీ జనరల్‌గా ఎం.డి.ఆజాద్, కోశాధికారిగా సీహెచ్.రవి ఎన్నికయ్యారు.

ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యవైఖరి తగదు: టీగారియా.. ఆలేరు: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని, ఉద్యోగులకు రావాల్సిన ఐదు విడతల డీఏను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీగారియా) రాష్ట్ర అధ్యక్షుడు అలుగోని నర్సింహులుగౌడ్ డిమాండ్ చేశారు. సంఘం ముఖ్య నాయకులతో కలిసి ఆదివారం ఆలేరులో విలేకరులతో మాట్లాడారు. దసరా పండుగ లోపు డీఏలు, ఉద్యోగవిరమణ ప్రయోజనాలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు బి.భిక్షం, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్ ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు కృషి చేయాలని వినతి.. రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేట రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు కృషి చేయాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ మాజీ కార్యదర్శి తాటిపాముల శేఖర్ హైదరాబాదులో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. నారాయణాద్రి, పలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపే విధంగా కృషి చేయాలని కోరారు.

వైద్యరత్న పురస్కారం ప్రదానం.. భువనగిరి గంజ్: ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న భువనగిరికి చెందిన ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్‌కు బహుజన సాహిత్య అకాడమీ వైద్య రత్న అవార్డును ప్రదానం చేసింది. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు రాకేశ్‌కుమార్ తెలిపారు.

ఎస్పీఎఫ్ సిబ్బంది సంతాపం.. యాదగిరిగుట్ట: ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ దండు రామలింగరాజు దశదినకర్మ సందర్భంగా యాదాద్రి ఆలయ భద్రత సిబ్బంది ఆదివారం సంతాపం ప్రకటించారు. రాజు గత నెల 26న ఆకస్మిక మరణం చెందిన విషయం తెలిసిందే. కొండపైన ఎస్పీఎఫ్ కార్యాలయంలో సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన పోటోకు పూలదండలు వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషగిరిరావు, ఎస్ఐ అనిల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వడ్ల చోరీని నియంత్రించాలి.. భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కుప్పల నుంచి వడ్ల చోరీని నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పట్టణ కేంద్రంలోని ముక్తాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసిన కుప్పల్లో నుంచి శనివారం రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు 30 బస్తాల ధాన్యాన్ని దొంగిలించారని రైతులు బండారు బాల్‌రెడ్డి, జంగారెడ్డి ఆరోపించారు.

చెట్టును ఢీకొట్టిన లారీ.. డ్రైవర్ మృతి

బీబీనగర్, న్యూస్‌టుడే: లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బీబీనగర్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాకు చెందిన ధరావత్ నరసింహ (38) ఆదివారం తెల్లవారుజామున వరంగల్ నుంచి ఇసుక లోడు లారీతో హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో బీబీనగర్ పెద్దచెరువు దగ్గర కట్ట ఉన్న రావిచెట్టును అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరసింహకు తీవ్రగాయాలయ్యాయి. హైవే అధికారులు గమనించి వెంటనే అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించేలోపే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నరసింహ

ధర్మారెడ్డిపల్లి కాల్వ పనులు పూర్తి చేయాలి

రామన్నపేట, న్యూస్‌టుడే: ధర్మారెడ్డిపల్లి కాల్వ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి కోరారు. సిరిపురంలో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ సభలో మాట్లాడారు. 20 ఏళ్లు గడిచినా కాల్వ పనులు పూర్తి చేయకపోవడానికి పాలకుల వైఫల్యం కారణమన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నేటికీ సక్రమంగా చెల్లించకపోవటం శోచనీయమన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు సిరిపురంలో చేనేత సొసైటీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లెల పెంటయ్య, అంజయ్య, అంబటి మల్లారెడ్డి, బద్దుల రమేష్, మిర్యాల భాస్కర్, రాపోలు ప్రభాకర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా రెడ్‌క్రాస్ సేవలు



సభ్యత్వ కార్డులను పొందినవారితో ఐఆర్‌సీఎస్ జిల్లా, డివిజన్ చైర్మన్లు లక్ష్మీనరసింహారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీలను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత చేరువగా సేవలందిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీ నరసింహారెడ్డి, డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సైదాపురంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సేవే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతుందని, సేవాదృక్పథం కలిగిన వారందరు సంస్థతో కలిసి రావాలని కోరారు. అనంతరం పలువురికి సభ్యత్వ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు బలరాం, జయశ్రీ, సంస్థ ప్రతినిధులు దిడ్డి బాలాజి, హమీద్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మయ్య, జనార్దన్‌రావు, ఉపేందర్, కృష్ణయ్య, వెంకటేశ్, లక్ష్మయ్య, రాంనర్సయ్య, మల్లేశ్, భరత్, బాలరాజు పాల్గొన్నారు.

'తీర్పు వచ్చే వరకు ఆగండి'

మోత్కూరు: గ్రూప్-1 నోటిఫికేషన్‌పై కోర్టులో ఉన్న పలు కేసుల పరిష్కారం తర్వాతే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఓయూ జేఏసీ నాయకుడు మర్రి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తీర్పు వచ్చే వరకు ఆగకుండా మెయిన్స్ పరీక్షల నిర్వహణ కోర్టు తీర్పులను వ్యతిరేకమని వివరించారు. తీర్పు వచ్చే వరకు ఆగాలని ప్రభుత్వాన్ని కోరారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజలను మతం పేరుతో రెచ్చగొడుతూ ప్రజల దృష్టిని మరలించి ప్రజాధనాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. మండలంలోని పుట్టపాకలో ఆదివారం పార్టీ మహాసభలో పాల్గొని మాట్లాడారు. భాజపా ప్రభుత్వం హయాంలో బలహీన వర్గాలపై, మహిళలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజల దృష్టిని మరలిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పించుకోవాలని చూస్తుందని ఆరోపించారు. అంతకు ముందు సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, దొంతగోని పెద్దులు, ఐతరాజు గాలయ్య, లాలయ్య, నర్సింహ, అమరేందర్ పాల్గొన్నారు.

స్వాగత వేడుకలో విద్యార్థుల సందడి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్‌లో ఆదివారం శ్రీవైష్ణవి జూనియర్ కళాశాల స్వాగత వేడుక జరిగింది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలో పాల్గొన్నారు. నాటికలు, నృత్య రూపకాలను ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ గడ్డం సోంచంద్ మాట్లాడారు.. విద్యపైనే వ్యక్తిగత అభివృద్ధి ఆధారపడి ఉన్నందున విద్యార్థులు పట్టుదల, అంకిత భావంతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధిర మల్లేశం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థినుల బృందం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన లబ్ధిదారులకు యాదగిరిగుట్ట పట్టణంలోని తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ చైతన్యరెడ్డి, మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్, పట్టణ అధ్యక్షుడు బందారు భిక్షపతి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

భాజపా సభ్యత్వ నమోదు

రాజపేట, న్యూస్‌టుడే: మండలంలోని పారుపల్లి, బొందుగుల, సోమారం గ్రామాల్లో ఆదివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు దాసరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు బందు జహంగీర్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థులను అత్యధికంగా గెలిపించుకునే కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాచెపల్లి శ్రీనివాస్, మేకల రమేశ్, శీలం పాపిరెడ్డి, మెండు భగవాన్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న గుంతలు



కొండమడుగు నుంచి కేపాల్ వెళ్లే మార్గంలో శివధర్మ కాంట వద్ద ఇలా..

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం కొండమడుగు నుంచి ఘట్‌కేసర్ మండలం కేపాల్ వెళ్లే మార్గం (సర్వీసు రోడ్డు) ప్రమాదాలకు నెలవుగా మారింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ సర్వీసు రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుండటంతో తరచూ రోడ్డుకు గుంతలు పడుతున్నాయి. సదరు గుంతలను గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆరునెలల్లో ఈ మార్గంలో ఒకరు మృతిచెందగా పదుల సంఖ్యలో వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ రోడ్డు దుస్థితి వేరే చెప్పనక్కర్లేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ మార్గంలో ప్రయాణమంటేనే వాహనదారులు జంకుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్వర్ణగిరిలో అన్నమాచార్య కీర్తనలు

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమాచార్య కీర్తన ఆలాపన ఆదివారం సాయంత్రం జరిగింది. శ్రీవారి వైభవోత్సవ మండపంలో స్వరవాణి సస్య స్వరాలు సంగీత కార్యక్రమాన్ని కనువిందుగా నిర్వహించారు. చిరబోలు శ్రీవాణి, పినిశెట్టి నవ్యశ్రీ కీర్తనలను ఆలపించారు.



కీర్తనలు ఆలపిస్తున్న చిరబోలు శ్రీవాణి, పినిశెట్టి నవ్యశ్రీ

కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు

ఈనాడు వందనం

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం కొలనుపాక- పటేలుగూడెం మార్గంలో ముత్తాల్లమ్మగుడి వద్ద ఉన్న వాగుపై కాజ్‌వే నిర్మాణానికి మండల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబరు 16న 'ఈనాడు'లో 'కాజ్‌వే నిర్మాణం సాకారమయ్యేనా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదేశాలతో రెండు రోజులుగా అధికారులు కాజ్‌వే ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. సుమారు 50 మీటర్ల పొడవు, 7.5మీటర్ల వెడల్పు, 10 వరుసలుగా సిమెంట్ పైపులతో కాజ్‌వే నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, బోధనా రుసుంల బకాయిలు విడుదల చేసి సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. భువనగిరిలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. విద్యను కాషాయీకరణ చేసేందుకు భాజపా జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వస్పుల అభిలాష్, నాయకులు సూరారం కల్యాణ్, ధనుష్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

రామన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ రఘునాథ్‌ప్రసాద్, సిద్దిపేట పంచాయతీరాజ్ ఈఈ రమేశ్ అన్నారు. పదవీ విరమణ పొందిన నల్గొండ నీటిపారుదల శాఖ ఈఈ బొడ్డు సురేందర్‌రావుకు రామన్నపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులోనూ నీటిపారుదల రంగానికి సురేందర్‌రావు సేవలు అందజేయాలన్నారు. సురేందర్‌రావు, లక్ష్మి దంపతులను నీటిపారుదల శాఖ అధికారులు, పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. జినుకల ప్రభాకర్, గంగుల రాజిరెడ్డి, సాల్వేరు అశోక్, బండిని రాములు, సకిరెకంటి మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



చౌళ్లరామారంలో..

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మండలం పరిధి చౌళ్లరామారంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. నాడు చదువు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. నాటి ప్రధానోపాధ్యాయుడు శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు రమేష్, నర్సయ్య, చంద్రయ్య, మల్లారెడ్డి, రవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలేరు: ఆలేరు మండలం కొలనుపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. నాడు కలిసి చదువుకున్న వారిలో 55 మంది సమ్మేళనానికి హాజరయ్యారు. 22 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న సందర్భంగా నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు జి.వీరారెడ్డి, పి.స్వర్ణలత, ఏవీఎన్‌రెడ్డి, కార్యక్రమ కన్వీనర్ తిప్పారపు మల్లేశ్, తాటిపాముల తిరుమలేష్, గడ్డం నాగరాజు, దూడల లక్ష్మన్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు అధ్యక్షుడిగా ఆకుల రవీందర్

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఆకుల రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం పట్టణ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నర్సింహ, బాలరాజు, నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా పరమేష్, సదానందం, కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజారాం, భాస్కర్, మహేందర్, సురేష్, కార్యవర్గ సభ్యులు మల్లేశ్, నర్సింహ, సత్యనారాయణ, పోచయ్య, రాము, జానకిరామ్, జగన్, గణేష్, శ్రీనివాస్ ఎన్నుకున్నారు.

ఘనంగా దుర్గామాత ఉత్సవాలు

భువనగిరి: స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజైన ఆదివారం అమ్మవారిని సంతానలక్ష్మీ స్వరూపంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆదివారం కావడంతో స్వర్ణగిరి భక్తులతో కిటకిటలాడింది.

భువనగిరి: ఆజాద్‌రోడ్డులోని శ్రీరామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సంతాన ప్రదాయినిగా స్వర్ణగిరి మహాలక్ష్మీ

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: బొమ్మలరామారంలో శివ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కట్ట శ్రీకాంత్, లోకేష్‌రెడ్డి, గణేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

మోత్కూరు : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మోత్కూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మవారి వద్ద మహిళలు అర్చకుడు పారునంది లక్ష్మణమూర్తిశర్మ సమక్షంలో కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక ఎస్సై నాగరాజు ప్రత్యేక పూజలు జరిపారు. సంఘం అధ్యక్షుడు ఎం.సోమయ్య, సోమ వెంకటేశ్వర్లు, బుక్క విశ్వనాథం, బి.ప్రసాద్, ఎస్.లింగయ్య, బుస్స శ్రీనివాస్, గౌరు శ్రీనివాస్, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాజపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాజపేట ... ఏర్పాటు చేసిన మంటపం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భాజపా రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, ఇతర నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

వలిగొండ: మండల కేంద్రంలోని శ్రీహరిహర త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు నాలుగో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవార్లు మహాలక్ష్మిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



భువనగిరిలో లలిత సహస్ర పారాయణంలో పాల్గొన్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీదుర్గా కమిటీ అధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి 33వ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాలు కనుల పండువగా జరిగింది. మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సీత సత్యనారాయణ, గుత్తికొండ మురళి, భోగ స్వామి, సీత వెంకటేశం, భోగ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల వ్యాప్తంగా దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారి అలంకరణ శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. గుడిగుట్ట ప్రాంతంలో శ్రీ అన్నపూర్ణేశ్వర స్వామి ఆశ్రమంలో శ్రీ శంకరానంద స్వామి ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

కూలిన చెట్లు.. విద్యుత్తు సరఫరాలో అంతరాయం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ రోడ్డు పక్కన చెట్లు కూలడంతో భువనగిరి-చిట్యాల మార్గంలో అనాజిపురం, అనాజిపురం-జంపల్లి మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం జరిగింది. అనాజిపురంలో సుమారు 2గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.

బతుకమ్మ సంబురాలు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లిలో ఆదివారం చిన్నారులు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శ్రీవైష్ణవి ట్యుటోరియల్ ఆధ్వర్యంలో బాల బలికలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.



తుర్కపల్లి: బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

యాదగిరిగుట్ట పట్టణం: నేడు పట్టణంలోని అఖిల భారత పద్మశాలి అన్న సత్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా చేపడుతున్నట్లుగా సత్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దీకొండ జోగయ్య ప్రకటనలో తెలిపారు.